క్లుప్తంగా

పోలీసుస్టేషన్ ఆకస్మిక తనిఖీ


పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురంలోని పోలీసుస్టేషన్‌ను మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ గురువారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలపై దృష్టి సారించాలన్నారు. గంజాయి, బెల్టుషాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో గస్తీ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ హనుమంతు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇ-క్రాప్ నమోదు తప్పనిసరి


జొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

చాపాడు: రబీలో సాగైన ప్రతి పంటను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో ఇ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయాలని సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత పేర్కొన్నారు. మండలంలోని ఎన్.ఓబాయపల్లెలో జొన్న పంటను గురువారం మండల వ్యవసాయాధికారి మ్యాగీతో కలసి ఏడీఏ అనిత పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగైన మినుము, జొన్న, శనగ, పెసర, వేరుశనగ వంటి పంటలకు ఇ-క్రాప్ నమోదు చేయాలన్నారు. ఇ-క్రాప్ నమోదు చేయడం వలన రైతులకు అన్ని విధాల ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఫసల్ బీమా యోజన పథకానికి ఈ నెల చివరి వరకూ అవకాశం ఉందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీమా చెల్లించాలంటే ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సాయిల్ కన్సర్వేషన్ ఏఓ బ్లెస్సీ, అగ్రికల్చర్ అసిస్టెంట్ బార్గవి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి

ప్రొద్దుటూరు : మున్సిపల్ స్థలాల్లోని ఆక్రమణలను తొలగించాలని కలెక్టర్‌కు ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ గురువారం ఫిర్యాదు చేశారు. 15 ఏళ్లుగా తాను కూరగాయల మార్కెట్ వద్ద పెద్దమ్మ ఆలయాన్ని నిర్మించి భోజనం వండటానికి రూము నిర్మించానన్నారు. నిత్యం అక్కడ అన్నదాన కార్యక్రమాలు చేస్తుండేవారమని తెలిపారు. ఆ స్థలాన్ని తాను వ్యాపార సంస్థకు వాడుకుంటున్నానని మున్సిపల్ కమిషనర్ బుల్డోజర్‌తో తొలగించారని పేర్కొన్నారు. పట్టణంలో ఎన్నో చోట్ల మున్సిపల్ స్థలాలను ఆక్రమించిన విషయంపై తాను ఫిర్యాదు చేసినా ఇంత వరకు చర్యలు తీసుకోలేదన్నారు. ఎస్ఎస్ మాల్ స్థలంలో ఏర్పాటు చేసిన జనరేటర్ మున్సిపల్ స్థలంలోనే ఉందని తెలిపారు. వెంటనే కలెక్టర్ ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

దళితులకు భూ పంపిణీ చేయాలి


తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న అన్వేష్

పోరుమామిళ్ల: అక్కలరెడ్డిపల్లె పంచాయతీలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నా పేదలకు సెంటు భూమి పంపిణీ చేయలేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్ అన్నారు. గురువారం అక్కలరెడ్డిపల్లె రెవిన్యూ సదస్సులో తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డికి దళితులకు భూమి పంపిణీ చేయాలని వినతిపత్రం అందచేశారు.
ఈ సందర్భంగా అన్వేష్ మాట్లాడుతూ సర్వే నంబర్ 1,854లో సాగు చేసుకుంటున్న పేదలకు భూమి పంపిణీ చేయాలని కోరారు. లచ్చంపల్లె రెవెన్యూ పొలంలో సర్వే నంబర్ 1లో సాగు భూములకు పట్టా ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కిరణ్, ఆరోగ్యం, రత్నమయ్య, రామయ్య పాల్గొన్నారు.

డోర్ డెలివరీని సద్వినియోగం చేసుకోండి

మైదుకూరు : ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మైదుకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీరామ్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం నుంచి జనవరి 19 వరకు డోర్ డెలివరీ మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో 80 ముఖ్య పట్టణాల్లో 10 కిలోమీటర్ల విస్తీర్ణం వరకు డోర్ డెలివరీని నిర్వహిస్తున్నట్టు వివరించారు. కార్గో సర్వీస్‌లో 50 కిలోల వరకు పార్సిల్ స్వీకరిస్తామని తెలిపారు. ఆర్టీసీని లాభాల్లో నడిపించేందుకు కార్గో సర్వీస్‌ను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆర్టీసీ అభివృద్ధికి ప్రయాణికులు, సిబ్బంది సహకరించాలని సూచించారు. అందరూ ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని కోరారు.

పసిడిపురిలో అలజడి

- దాడులకు తెగబడుతున్న యువకులు
- ఇటీవల రాఘవేంద్రకుమార్ అలియాస్ పప్పి హత్య
- పోలీసు గస్తీ పెంచాలంటున్న పట్టణ వాసులు


రాఘవేంద్రకుమార్ హత్య కేసులో నిందితుల అరెస్ట్ చూపిస్తున్న పోలీసు అధికారులు (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం: ప్రశాంతంగా ఉన్న పసిడిపురిలో ఇటీవల అలజడి నెలకొంది. అల్లరి మూకలు రెచ్చిపోతున్నారు. ఇటీవల జమ్మలమడుగు బైపాస్ రోడ్డులో ఏ కారణం లేకుండానే మద్యం మత్తులో నలుగురు కలిసి ఒక యువకుడిని చితకబాదారు. రామేశ్వరంలోని ఒక యువకుడు మద్యం మైకంలో తల్లినే చితకబాదాడు. లబోదిబోమంటూ ఆ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఐదుగురు యువకులు తాగిన మత్తులో ఒక యువకుడిని మద్యం సీసాలతో దాడి చేశారు. మచ్చుకు ఇవి కొన్ని మాత్రమే.. ఇలాంటి ఘటనలు నిత్యం ఎక్కడో ఒక చోట ప్రొద్దుటూరులో జరుగుతూనే ఉన్నాయి. ఏ కారణం లేకుండా అల్లరి మూకలు దాడులకు పాల్పడుతున్నారు. మద్యం, గంజాయికి అలవాటు పడిన యువకులు బ్యాచ్‌లుగా ఏర్పడి గొడలకు దిగుతున్నారు. మద్యం మత్తులో తాగిన ఖాళీ మద్యం సీసాలతో దాడులు చేసుకోవడం ఇక్కడ పరిపాటిగా మారింది. ప్రతి చిన్న విషయానికి శారీరక దాడులకు పాల్పడిన ఘటనలు తరచూ జరుగుతున్నాయి. యువకులు దాడులకు పాల్పడి కేసుల్లో ఇరుక్కోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి గస్తీ తగ్గడంతోనే ఘర్షణలు, పరస్పర దాడులు జరుగుతున్నట్లు పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రొద్దుటూరులో ఇటీవల జరిగిన ఘటనలను పరిశీలిస్తే యువకులు, మైనర్ల ప్రమేయం వాటిలో ఎక్కువ ఉన్నట్లు తెలుస్తోంది. వీటిపై పోలీసు అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

- వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో ఆదివారం రాత్రి ఐదుగురు యువకులు మద్యం మత్తులో అలజడి సృష్టించారు. బెదిరించాడనే కారణంతో శ్రీరాంనగర్‌కు చెందిన యువకులు మద్యం సీసాలు, బ్యాట్‌లతో చరణ్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తిని దారుణంగా కొట్టారు. విడిపించడానికి ప్రయత్నించిన ఓ వ్యక్తిపై దాడి చేశారు.
- ఈ నెల 1న అర్ధరాత్రి సుందరాచార్యుల వీధిలోని ఒక లాడ్జీలో ముగ్గురు వ్యక్తులు ఏకే రోడ్డుకు చెందిన రాఘవేంద్రకుమార్ అలియాస్ పప్పీని దారుణంగా హత్య చేశారు. మద్యం మత్తులో మాటా మాటా పెరగడంతో మద్యం సీసాలతో కొట్టి, గొంతు నులిమి చంపేశారు. ఈ ఘటనలో పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఈ హత్య పట్టణంలో సంచలనం కలిగించింది.
- గత నెలలో ఒకే రోజు కత్తితో దాడులు చేసుకున్న ఘటనలు టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు చోట్ల జరిగాయి. మైదుకూరు రోడ్డులోని వాస్తు కాంప్లెక్స్ సమీపంలో సిగరేట్ పొగ పడదని, పక్కకు వెళ్లి తాగమన్నందుకు కాలేషావలి అనే వ్యక్తిని పీరా అనే వ్యక్తి కత్తితో పొడిచాడు. ఈ ఘటనలో అతను తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అదే రోజు ఏకే రోడ్డుకు చెందిన సుధీర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో పొడవడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు.
- కొన్ని రోజుల క్రితం పెన్నానదిలో ఇసుక రవాణా విషయమై రామాపురం గ్రామానికి చెందిన ఇరువర్గాలకు చెందిన వ్యక్తులు పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో బోనం గుర్రప్ప అలియాస్ గురివిరెడ్డితో పాటు మరో వర్గానికి చెందిన ప్రదీప్, సురేంద్రలకు గాయాలయ్యాయి.
- మండల పరిధిలోని తాళ్లమాపురం గ్రామంలో రామలక్ష్మమ్మ అనే ఒంటరి మహిళ నిద్రపోతున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి కత్తితో పొడిచాడు. ఇంటి తాళాలు ఇవ్వమని మహిళను బెదిరించిన దుండగుడు.. తాళాలు ఇవ్వకపోవడంతో కత్తి తీసుకొని మహిళ వీపుపై, గొంతు, కడుపులో పొడిచాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆమెను కర్నూలుకు తరలించారు.

పోలీసు విజిబులిటి పెంచుతాం



పట్టణంలో ఘర్షణలు, ఇతర నేరాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. పోలీసు విజిబులిటి పెంచుతాం. ముఖ్యంగా రాత్రి వేళల్లో పోలీసు గస్తీ ముమ్మరం చేస్తాం. పట్టణ శివారులోని బైపాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టి చర్యలుతీసుకుంటాం.
–ఎం. భక్తవత్సలం, ప్రొద్దుటూరు డీఎస్పీ

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమే


పరుగు పందెంలో పాల్గొన్న క్రీడాకారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమేనని వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజ్ ఆఫ్ యోగివేమన యూనివర్సిటీ ప్రిన్సిపాల్ జయరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక కొర్రపాడు రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కడప రీజనల్ స్థాయి 27వ ఇంటర్ పాలిటెక్నిక్ బాలుర స్పోర్ట్స్, గేమ్స్ పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన వారికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఉన్నాయని, క్రీడల యొక్క ప్రాముఖ్యతను వివరించారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జింకా అశోక్‌బాబు మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహద పడుతాయన్నారు. నిత్యం క్రీడా సాధన చేసి ఉత్త క్రీడాకారులుగా ఎదగాలన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి పావురాలను ఎగుర వేసి క్రీడలను ముఖ్య అతిథులు ప్రారంభించారు. ఈ పోటీల్లో 15 ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 450 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరికి రాయలసీమ వ్యాయామ కళాశాలలో చెస్, వాలీబాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, 100మీ, 200మీ, 400మీ, 800మీ, 1500మీ, హైజంప్, లాంగ్‌జంప్, బ్రాడ్ జంప్, ట్రిపుల్ జంప్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. శనివారం వరకు క్రీడాకారులకు పోటీలు జరుగనున్నాయి. ఆర్‌జేడీ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటసుబ్బయ్య, ఆర్‌సీపీఈ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, ఈఈఈ హెచ్‌ఓడీ మంజునాథ్, వివిధ శాఖల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తున్నారు.


పావురాలను ఎగుర వేస్తున్న వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ జయరామిరెడ్డి, అశోక్‌బాబు

రెవెన్యూ సదస్సులతో సమస్యలు పరిష్కారం


మాట్లాడుతున్న తహసీల్దారు రమాకుమారి

చాపాడు: రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దారు రమాకుమారి పేర్కొన్నారు. మండల పరిధిలోని పిచ్చపాడు రెవెన్యూ గ్రామంలో గురువారం రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ గ్రామాల్లో రైతులకు సంబంధించిన ఎలాంటి భూ సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సదస్సులను రైతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిచ్చపాడు రెవెన్యూ గ్రామ పరిధిలో జరుగుతున్న గ్రీన్‌ఫీల్డు హైవే నిర్మాణ పనుల్లో భూములు కోల్పోయి పరిహారం అందని రైతులకు న్యాయం చేస్తామని, తమ వద్ద ఉన్న భూ ఆధారాలను తమకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు కృష్ణారెడ్డి, రీ సర్వే డీటీ నారాయణ స్వామి, ఆర్ఐ శివశంకర్‌రెడ్డి, వీఆర్ఓ సుబ్బన్న, సర్వేయర్ సౌందర్య, స్థానిక గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేస్తాం

నేషనల్ గ్రీన్‌ఫీల్డు ఎక్స్‌ప్రెస్ హైవే లో భూములు కోల్పోయిన బాధిత రైతులు తమ వద్దనున్న పూర్తి ఆధారాలను తమకు అందజేయాలని తహసీల్దారు రమాకుమారి పేర్కొన్నారు. మండల పరిధిలోని అనంతపురం, బూడిదపాడు రెవెన్యూ గ్రామాలలో గ్రీన్‌ఫీల్డు హైవేలో భూములు కోల్పోయి నష్టపరిహారం అందని రైతులతో గురువారం తహసీల్దారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ పరిహారం అందలేదనే కారణంగా నేషనల్ హైవే పనులను రైతులు అడ్డుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికే భూములు కోల్పోయిన రైతులు అందించిన ఆధారాల మేరకూ వారికి పరిహారం అందించడం జరిగిందన్నారు. పరిహారం అందని భూములు కోల్పోయిన రైతులు తమ వద్ద ఉన్న ఆర్‌హెచ్, ఈసీ, 1-బి, సర్వే నెంబర్ ల వివరాలను తమకు అందజేయాలన్నారు. సంబంధిత రైతుల వివరాలను, రికార్డులను పరిశీలించి బాధిత రైతులకు తగిన న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హైవే అథారిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి


ఆందోళన చేస్తున్న దళిత సంఘాల నాయకులు

బద్వేలు అర్బన్ : కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని దళిత నాయకులు ఓ.ఎస్.వి.ప్రసాద్, పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి అధికార ప్రతినిధి ఎం.పిచ్చయ్య డిమాండ్ చేశారు. రాజ్యాంగ వజ్రోత్సవాల్లో భాగంగా రాజ్యసభలో అంబేడ్కర్‌ను ఉద్దేశించి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నెల్లూరురోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగంపై ప్రమాణం చేసి మంత్రి పదవి చేపట్టిన అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ పైనే అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, తక్షణమే ఆయన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవడంతో పాటు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత నాయకులు మురళి, నారాయణ, దళిత ప్రజా సంఘాల నాయకులు సుబ్బరాయుడు, వెంకటసుబ్బయ్య, లక్ష్మీనరసయ్య, గంగయ్య, ప్రసాద్, భాస్కర్, ఉల్లాజిమురళి, భాస్కర్, తిరుపాల్, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరసన

పోరుమామిళ్ల: రాజ్యసభలో అంబేడ్కర్‌ను ఉద్దేశించి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం అంబేడ్కర్ సేన, దళిత సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ సర్కిల్‌లో జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, అంబేడ్కర్ సేన ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాదరావు మాట్లాడుతూ అమిత్‌షా రాజ్యాంగ విలువలు మరచిపోయారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బాబు, కిరణ్, నాగరాజు, చరణ్, చెన్నరాయుడు, శివ, గురయ్య పాల్గొన్నారు.

అష్ఫాఖుల్లా, రాంప్రసాద్ త్యాగం చిరస్మరణీయం


బద్వేలు అర్బన్ : హిందూ, ముస్లిం ఐక్యతాదినోత్సవాన్ని నిర్వహిస్తున్న నాయకులు


పోరుమామిళ్ల: అష్ఫాఖుల్లాఖాన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

బద్వేలు అర్బన్ : దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు పణంగా పెట్టిన అష్ఫాఖుల్లాఖాన్, రాంప్రసాద్ బిస్మిల్ త్యాగం, స్నేహం చిరస్మరణీయమని ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు పి.చాంద్‌బాషా, వైవీయూ పాలక మండలి సభ్యులు కొండపల్లి చిన్నసుబ్బారావు కొనియాడారు. అష్ఫాఖుల్లాఖాన్, రాంప్రసాద్‌బిస్మిల్‌ల వర్ధంతి సందర్భంగా గురువారం మసీదు కాంప్లెక్స్ వద్ద హిందూ, ముస్లిం ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అష్ఫాఖుల్లాఖాన్, రామ్‌ప్రసాద్‌బిస్మిల్ కుటుంబ నేపథ్యాలు ఉత్తర, దక్షిణ ధ్రువాల్లాంటివని, అయినప్పటికీ మాతృదేశ స్వాతంత్ర్య ఉద్యమం కోసం ప్రాణమిత్రులుగా మారి తమ పోరాట పంథాను కొనసాగించారని గుర్తుచేశారు. అష్ఫాఖుల్లాఖాన్, రామ్‌ప్రసాద్‌బిస్మిల్‌ల స్నేహం హిందూ, ముస్లిం ఐక్యతకు నిదర్శనమని అన్నారు. కౌన్సిలర్ మహమ్మద్‌హుస్సేన్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహబూబ్‌బాషా, పట్టణాభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఎస్.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు శ్రీనివాసులరెడ్డి, ఆవాజ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్‌సత్తార్, అన్వర్‌బాషా, మైనార్టీ నాయకులు ఎస్.ఎం.బాషా పాల్గొన్నారు.

పోరుమామిళ్ల: దేశాన్ని ప్రేమించిన గొప్ప స్వాతంత్ర్య సమర యోధుడు అష్ఫాఖుల్లాఖాన్ అని ఆవాజ్ మండల నాయకురాలు గౌసియాబేగం, మండల కార్యదర్శి షరీఫ్ కొనియాడారు. గురువారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో అష్ఫాఖుల్లాఖాన్ వర్ధంతి సందర్భంగా ఆవాజ్ మండల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1927 డిసెంబర్ 19న అష్ఫాఖుల్లాఖాన్‌ను తెల్లదొరలు ఉరి తీశారన్నారు. అష్ఫాఖుల్లాఖాన్ నుంచి భగత్‌సింగ్ స్ఫూర్తి పొందారని గుర్తుచేశారు. ఆవాజ్ నాయకులు మాబు, బీబి, ఫాతిమా, సీఐటీయూ నాయకులు చిన్నయ్య, నారాయణ, దుర్గయ్య, వరలక్ష్మి, మేరి పాల్గొన్నారు.

రేపు పుస్తక ఆవిష్కరణ సభ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక నడింపల్లెలోని ఎస్బీ మెమోరియల్ హైస్కూల్‌లో శనివారం ఉదయం 9 గంటలకు ఎస్.దస్తగిరి సాహెబ్ 9వ వర్ధంతిని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఎస్‌డీఎస్ సేవా సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ పోలవరపు శంకరయ్య నాయుడు రచించిన 'అభిజ్ఞాన శాకుంతులము' తెలుగు అనువాదం, ఖలందర్ రచించిన 'వసంత సేన చారుదత్తం' పుస్తకాలను ఆవిష్కరించనున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ అహ్మద్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. సభ అధ్యక్షుడిగా విశ్రాంత జడ్జి ఎస్ఎం ఇస్మాయిల్, మాజీ ఎమ్మెల్సీ సి.నారాయణరెడ్డి, ప్రధాన వక్తలుగా డాక్టర్ పోలవరపు శంకరయ్య నాయుడు, బ్యాంకు మేనేజర్ ఖాజా మైనోద్దీన్, ఎన్నెస్ ఖలందర్ పాల్గొంటారని సభను జయప్రదం చేయాలని కోరారు.

'జింకా'కు ఆహ్వానం


జింకా సుబ్రహ్మణ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : విజయవాడలో ఈ నెల 28, 29 తేదీల్లో జరగనున్న 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు ప్రొద్దుటూరుకు చెందిన జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యంకు ఆహ్వానం అందింది. ఈ నెల 29న ఆదివారం సాహితీ సంస్థల ప్రతినిధుల సదస్సుల్లో ఆచార్య లక్ష్మీప్రసాద్ అధ్యక్షతన జరిగే సభలో వక్తగా పాల్గొనవలసిందిగా వారు ఆహ్వానం పంపినట్లు జింకా సుబ్రహ్మణం తెలిపారు. ఈ సభలలో దాదాపు 2వేల మంది ప్రతినిధులు పాల్గొంటారని, ఈ సభలో జిల్లా రయితల సంఘం పక్షాన పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు.

పట్టణ పరిశుభ్రతకు సహకరించాలి


ప్రజలకు సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్ : పట్టణ పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని గట్టుపల్లె పునరావాసకాలనీలో పర్యటించిన ఆయన స్థానిక ప్రజలతో మాట్లాడుతూ వీధుల్లో చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని సూచించారు. అలాగే ఖాళీ జాగాల్లో ఉన్న పిచ్చిమొక్కలు, కంపచెట్లను స్వచ్ఛందంగా తొలగించుకుని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. మున్సిపాలిటీ అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని సూచించారు. కాలనీకి తాగునీటి సమస్య ఉందని, పైపులైను ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకురాగా అమృత్ పథకం 2.0 కింద త్వరలోనే పనులు చేపడతామని హామీ ఇచ్చారు.

ధరల పట్టిక ఏర్పాటు చేయాలి

పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో వ్యాపారస్తులు తప్పనిసరిగా ధరల పట్టిక ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి వ్యాపారస్తులకు సూచించారు.

దేవుడా నీడేదీ!

- బ్రహ్మంగారి మఠంలో బస్ షెల్టర్ లేక ప్రయాణికుల అవస్థలు
- రోడ్డుపైనే జనం పడిగాపులు
- పట్టించుకోని అధికారులు


నిలిచిపోయిన బస్ షెల్టర్ నిర్మాణ పనులు

బ్రహ్మంగారిమఠం: ప్రముఖ పుణ్యక్షేత్రం బ్రహ్మంగారిమఠంలో బస్సు షెల్టర్ లేక భక్తులు, స్థానికులు అవస్థలు పడుతున్నారు. నిలువ నీడ లేక పాట్లు పడుతున్నారు. బస్సుల కోసం రోడ్డుపైనే పడిగాపులు కాస్తున్నారు. ఇక ఒంటికి, రెంటికి వస్తే ఇక కష్టమే. వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు వేల సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు. అంతటి ప్రాధాన్యత ఉన్న బ్రహ్మంగారిమఠంలో ప్రయాణికులకు కాసింత కూర్చొవడానికి బస్ షెల్టర్ లేక చెట్ల కింద, దుకాణాల్లో సేద దీరుతున్నారు. ఇక వర్షం వస్తే పరిస్థితి చెప్పనలవికాదు. ఈ బస్టాప్ వద్ద ఎప్పుడు చూసినా పదుల సంఖ్యలో భక్తులు, ప్రయాణికులు, బస్సుల కోసం, ఆటోల కోసం రోడ్డుపక్కన వేచి ఉండాల్సిన దుస్థితి.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బస్‌షెల్టర్ నిర్మాణం కోసం రూ. 12 లక్షలు నిధులు మంజూరు చేశారు. నిర్మాణ పనుల కోసం టెండర్ల ప్రక్రియ కూడా పూర్తైంది. ఈ నేపథ్యంలోనే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పాటు వీరబ్రహ్మేంద్రస్వామి శిష్యుడైన దూదేకుల సిద్దయ్య కుటుంబ సభ్యులు ఈ స్థలం తమదేనంటూ బద్వేలు కోర్టును ఆశ్రయించడంతో పనులు నిలిచిపోయాయి. విచారణలో భాగంగా రెవెన్యూ అధికారులు వంక పోరంబోకు స్థలంగా గుర్తించి కోర్టుకు వివరణ ఇచ్చారు. ప్రజల సౌకర్యం కోసం బస్సు షెల్టర్ నిర్మాణం చేపట్టాలని కోర్టుకు తెలిపారు. ఇంతలోనే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇప్పటివరకు పనుల్లో ఎలాంటి పురోగతి కనిపించలేదు. బస్సు షెల్టర్ నిర్మించాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ దృష్టి స్థానికులు తీసుకెళ్లారు.

వాపోతున్న ప్రయాణికులు

ప్రయాణికులు అవస్థలు పడకుండా అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా ఆర్టీసీ ఆచరణలో మాత్రం అమలు చేయడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఆర్టీసీ ద్వారా ప్రభుత్వానికి కోట్ల ఆదాయం సమకూరుతున్నా సౌకర్యాల కల్పనపై శ్రద్ధ చూపడం లేదని పేర్కొంటున్నారు. బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు రోడ్డుపైనే నిలబడాల్సి వస్తోంది. ఎండకు ఎండుతూ.. వర్షానికి తడవాల్సి వస్తుంది. అధికారులు బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.

రోడ్డును కమ్మేస్తున్న కంపచెట్లు


బి.మఠం- బద్వేల్ రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లు

బ్రహ్మంగారిమఠం: బి.మఠం –బద్వేల్ రహదారికి ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో వాహనదారులకు అసౌకర్యంగా మారింది. ఆర్అండ్‌బీ అధికారులు కంపచెట్లు తొలగించక నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. మరో వాహనం ఎదురుగా వచ్చినప్పుడు రోడ్డు పక్కకు వెళ్లలేని పరిస్థితి ఎదురవుతోంది. మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడడం లేదు. దీంతో ప్రమాదాలకు ఆస్కారం కలుగుతోంది. రహదారిలో కొన్ని చోట్ల కంపచెట్లు రోడ్డుకు ఇరువైపులా ద్విచక్రవాహనం కూడా వెళ్లలేని విధంగా ఏపుగా పెరిగాయి. అధికారులు స్పందించి కంపచెట్లు తొలగించి ప్రమాదాలు నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

జీవ రసాయనాలతో ఆరోగ్యకరమైన పంటలు



టమాటా పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త బాలకృష్ణ

మైదుకూరు : జీవ రసాయనిక ఎరువులతో ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చని మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని ముదిరెడ్డిపల్లె సుగాలి తండాలో జీవ రసాయనిక ఎరువులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీవ రసాయనిక ఎరువుల ప్రాముఖ్యతను వివరించిన శాస్త్రవేత్త బాలకృష్ణ జీవ రసాయనిక ఎరువుల తయారీని ప్రత్యక్షంగా చేయించి వివరించారు. ఏ పంటకు ఏ జీవ రసాయనిక ఎరువు ఎంత మోతాదులో వాడాలో తెలియజేశారు. అనంతరం చీని, పసుపు, టమాటా పంటలను పరిశీలించారు. ఆయా పంటలకు ఆశించే తెగుళ్లు, నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు.